









మా తెలుగు తోటలో
మంచి పూలున్నాయి-
మీకు కావాలమ్మ
మీకు కావాలా-
మా తాత నాటాడు
మా మంచి తోట -
ఆ తోట నీడలో
అందాల బాట -
ఆ బాట ప్రక్కనే
నీటుగా నెన్నిటినో

నాటారు పాపమ్మ నీలాంబరాలూ!
నీలాంబరంబివలె నిలుచుండి చూడమ్మ!
నిలుచుండి చూస్తేను
నిలువెత్తునున్నాయి!
పొంచి చూచావంటే
పరుగెత్తుచున్నాయ్!
బంగారు కొండలా పండుగలాగున్నాయ్
కన్నుల కింపైన కనకాంబరాలూ,
మిరుమెరుపుల్లాటి మల్లెజాజీలు!

# పూలతమ్మా! పాడవమ్మా! ప్రణవ భారత గీతి!



శుభ్రజ్యోత్స్నా పులకితయామిని, పుల్లకుసుమిత ద్రుమదళశోభినీ సుభాషిణీమ్ సుమధుర భాషిణీమ్, హ్లాదినీమ్, ఆపాద మస్తక ఆంధ్రప్రదేశం ఆహ్లాదనీం అతిరమణీయం, ఆనంద నందన వనం- అంటూ కొన్నేళ్ళ క్రితం మధురవాగ్వాణీ వరభరితమైన నా 'మధురవాణి' మా(న)స పత్రికకు వ్రాసిన కొన్ని పదములే గుర్తున్నాయ్. అయిదు దశాబ్దముల క్రితం సంగతి కాబట్టి కొంత నేను మరిచిపోయి ఉండవచ్చు. కానీ ఈ మధుర పలుకుల పలుకుబడి అంతా 'వందేమా'తరమ్ సుజలాం, సుఫలాం- నుంచి పుట్టినవే!

ఈ పదపడి కర్త బకిమ్ చంద్రుడు ఆంధ్రప్రదేశంలోని గోదావరీ తీరప్రాంతాలను ముందుగానే ఊహించి ఉంటాడు. కాటన్‌దొర గోదావరికి ఆనకట్టు కట్టి గోదావరి సుజలాలను అక్కడంతా పారేట్టు చేసి ఉంటాడు.

రాజమండ్రీ నుంచీ నేను వెదురుపాక వెడుతూ, తూర్పుగోదావరి మండలమంతా కారులో చుట్టాను. నా కళ్ళముందు ఇంద్రధనస్సు కిరణములువలె దీపావళి తిప్పుడు పొట్లంలా తిరుగుతున్నాయ్. పగలే వెన్నెలా జగమే ఊయలా, మనసే ఊగగా- అన్నట్టు దేవేంద్ర వనంలోకి ప్రవేశించినట్టనిపించింది. తూర్పుగోదావరి జిల్లాలోని కడియం లోని పుష్పవనానికి నవరంగుకుసుమాల కడియంగా మారింది.

## కడియం పుష్పాలు కనక కుసుమాలు!

500 ఎకరాలు నర్సరీ మొక్కలతో నిండు జాబిల్లిలా, హరితవనంలా పరిఢవిల్లుతున్న ఈ ఆనందనందన బృందావనం జతకూడి 2000 ఎకరములో చక్కని తుమ్మెద రెక్కల్లా, భ్రమరముల్లా పురివిప్పిన నెమలిలా ఎన్నెన్ని రకాల కుసుమాలను కుసుస్తున్నాయో. ఎన్ని ప్రదేశాలకు ఎగుమతియవుతున్నాయో అంచనా వేయలేకపోయాను. దరిదాపు 150 రకాల పుష్పాలు పూచే మొక్కలున్నట్టు తెలుస్తూన్నది.

కడియం మండలంలోని వెంకాయమ్మపేట, కడియపు సావరం, మురమండ, బుర్రిలంక, దుళ్ళ, కడియపులంక, వేమగిరి, జేగేరుపాడుల్లోనూ, మాధవరాయుడు పాలెంలోని అనేకానేక పూల మొక్కలను అన్ని కాలాల్లోనూ లభించేట్టు ఈ కడియంగార్డెన్స్ పుష్పరాశికే కడియం తొడిగినట్టున్నాయ్.

ఆనాడు తెలిసి ఉంటే శ్రీకృష్ణపరమాత్ముడు సత్యభామ కోసం ఎన్నో పుష్పాలను ఇక్కణ్ణుంచే తీసుకుని వెళ్ళి ఉండేవాడు. అమరావతిలోని దేవేంద్రునికీ సంకల్పం కలుగలేదెందువల్లనో! బహుశః నారదులవారుంటే సమాచారం ఇచ్చేవారు. ఇలాటి నందన పుష్పవనాన్ని పెంచిన యాజమాన్యాన్ని అభినందిస్తున్నాం.

## సంరక్త చూర్ణం, సువర్ణతోయం, సుకుంకమాభం సుకుసుమ సమర్పయామి శర్వాణీం!